
## విజయ్ సినిమా టైటిల్ అదేనా?



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా సినిమా టైటిల్ ఏమిటన్నది అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. 'వీడీ 12' వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. గతంలో విడుదల చేసిన ఫస్ట్‌గ్లింప్స్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. టైటిల్‌ను త్వరలో ప్రకటిస్తామని నిర్మాత సూర్యదేవర నాగవంశీ కొద్దిరోజుల క్రితం తన సోషల్‌మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా టైటిల్ ఏమిటన్నది అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'సామ్రాజ్యం' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని రూమర్స్ వినిపిస్తున్నాయి. అయితే ఇదంతా సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారమేనని, టైటిల్ గురించి అతి త్వరలో అధికారిక ప్రకటన రానుందని సమాచారం. ఈ సినిమా మే నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఫిల్మ్ ఛాంబర్ సినిమా అవార్డులు

### ఫిబ్రవరి 6న సినిమా దినోత్సవం



గురువారం హైదరాబాద్ కార్యాలయంలో సమావేశమైన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఇక నుంచి ప్రతి ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు వివిధ విభాగాల కింద సినిమా అవార్డులను ప్రదానం చేయాలని నిర్ణయించింది. తెలుగు సినిమా పుట్టిన రోజుని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 6న ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. అదే రోజున నటులు తమ ఇళ్లపై, థియేటర్ల వద్ద ప్రత్యేకంగా జెండాలను ఆవిష్కరించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రముఖ రచయిత, నటుడు పరుచూరి గోపాలకృష్ణ అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ అధ్యక్షుడు దామోదరప్రసాద్ మాట్లాడుతూ 'ఫిబ్రవరి 6న సినిమా దినోత్సవాన్ని గతంలో కొన్ని సంస్థలు చేశాయి. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ తరపున తొలిసారి చేయబోతున్నాం. వచ్చే ఏడాది నుంచి ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తాం. అలాగే పాతతరం కళాకారులను సన్మానిస్తాం' అన్నారు. ఛాంబర్ కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'తెలుగు తొలిటాకీ ఫిల్మ్ 'భక్త ప్రహ్లాద' ఫిబ్రవరి 6న విడుదలైంది. ఈ రోజు సినిమా పుట్టిన రోజు. తెలుగు సినిమా గొప్పదనాన్ని చాటేలా సినిమా దినోత్సవ వేడుకను నిర్వస్తాం' అన్నారు. ఇండస్ట్రీలోని అన్ని విభాగాల వాళ్లు సమన్వయం చేసుకొని ఈ వేడుకను నిర్వహించాలని నటుడు, నిర్మాత మురళీమోహన్ సూచించారు.



## సోనూ లైలాగా మారిన వైనం

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకుడు. షైన్‌స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్‌లో విశ్వక్‌సేన్ లైలా అనే లేడీ గెటప్‌లో కనిపించనున్నారు. దీంతో ఈ సినిమా ప్రేక్షకుల్లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేస్తున్నది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. బ్యూటీపార్లర్ నడుపుతున్న సోనూ మోడల్ ఓ ఎమ్మెల్యే హత్య కేసులో ఇరుక్కుంటాడు. దీంతో అతని మనుషులు సోనూను చంపేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. వారి బారి నుంచి రక్షించుకోవడానికి సోనూ లైలాగా లేడీ గెటప్‌లోకి మారిపోతాడు. ఈ నేపథ్యంలో ట్రైలర్ ఆసాంతం నవ్వుల్ని పంచింది. విశ్వక్‌సేన్ మాట్లాడుతూ 'లైలా మీ అందరిని తప్పకుండా నవ్విస్తుంది. లైలా గెటప్ వేసుకోవడానికే రెండు గంటల సమయం పట్టేది. ఈ సినిమాలోని 'అటక్ పటక్' అనే పాటను త్వరలో విడుదల చేయబోతున్నాం. ఆ పాటను నేనే రాశా' అన్నారు. ఆకాంక్షశర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతాన్నందించారు.

## శ్రీవిష్ణు 'సింగిల్'



గత ఏడాది 'ఓం భీమ్ బుష్' చిత్రంతో మంచి విజయాన్ని దక్కించుకున్నారు యువ హీరో శ్రీవిష్ణు. ప్రస్తుతం ఆయన రెండు చిత్రాలతో బిజీగా ఉన్నారు. అందులో గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించే సినిమా ఒకటి. శ్రీవిష్ణు నటిస్తున్న 18వ చిత్రమిది. ఈ చిత్రానికి కార్తిక్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు 'సింగిల్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. త్వరలో ఈ విషయమై అధికారిక ప్రకటన రానుంది.

## కాస్త దయతో ఉండాలి!



కాలికి గాయమైనా ఏమాత్రం లెక్కచేయకుండా తన తాజా చిత్రం 'ఛావా' ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నది రష్మిక మందన్న. వీల్‌ఛైర్‌లోనే ఆమె ప్రచార కార్యక్రమాలకు హాజరవుతున్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. వృత్తిపట్ల రష్మిక మందన్న అంకితభావాన్ని నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో రష్మిక మందన్న తాజా పోస్ట్ అందరిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. 'ఈ రోజుల్లో సాటి వ్యక్తులతో దయగా ఉండటం తగ్గిపోతున్నది. నేను మాత్రం అందరి పట్ల దయతో ప్రవర్తిస్తాను. మీరందరూ కూడా అలాగే ఉండండి' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొంది రష్మిక మందన్న. ఈ సందర్భంగా పోస్ట్ చేసిన ఫొటోలో ఆమె ధరించిన టీ షర్ట్‌పై కూడా 'కైండ్‌ఫుల్' (దయతో) అని రాసి ఉంది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రష్మిక మందన్న నటించిన చారిత్రక చిత్రం 'ఛావా' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. విక్కీకౌశల్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని మరాఠీ యోధుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించారు. వీటితో పాటు తెలుగులో కుబేర, ది గర్ల్‌ఫ్రెండ్, రెయిన్‌బో చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది రష్మిక మందన్న.



## ఏప్రిల్ నుంచి 'ఎల్లమ్మ'

'బలగం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు వేణు యెల్దండి. ఆయన తదుపరి చిత్రంగా 'ఎల్లమ్మ'ను తెరకెక్కించబోతున్న విషయం తెలిసిందే. నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి దిల్ రాజు నిర్మాత. తెలంగాణ గ్రామదేవతల నేపథ్యంలో సాగే సోషల్‌డ్రామా ఇదని సమాచారం. కథానాయికగా సాయిపల్లవి ఖరారయ్యే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంలో చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు మొత్తం పూర్తయ్యాయని, మార్చిలో లాంఛనంగా ప్రారంభోత్సవం జరిపి, ఏప్రిల్ నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టే ఆలోచనలో దిల్ రాజు ఉన్నారని అంటున్నారు. 'బలగం' తర్వాత వేణు యెల్దండి దర్శకత్వంలో రానున్న ఈ సినిమా గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


## ఇది మన ఇంటి కథ



సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్న తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ '3బీహెచ్‌కే'. శ్రీగణేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్నారు. అరుణ్‌విశ్వ నిర్మాత. గురువారం ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. 'ఇది మన ఇంటి కథ. ఈ ఇంట్లోనే చిన్న చిన్నగా చాలా కథలున్నాయి. ఇది మాసాల డబ్బా కాదు. అమ్మగారి చిన్న బ్యాంక్. ఇది నాన్నగారి సెంటిమెంట్ బీరువా' అంటూ సిద్ధార్థ్ వాయిస్‌ఓవర్‌తో మొదలైన టీజర్ ఇంట్రెస్టింగ్‌గా సాగింది. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అమృత్ రామ్‌నాథ్, సంభాషణలు: రాకేందు మౌళి, రచన-దర్శకత్వం: శ్రీగణేష్.

## 'తండేల్' అంచనాలకు మించి ఉంటుంది

### తెలంగాణలో టికెట్ రేట్లు పెంచమని అడగలేదు: అల్లు అరవింద్



'ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ ధరలు తక్కువగా ఉన్నాయి. అందుకే అక్కడ రేట్లు పెంచాలని అడిగాం. అది కూడా టికెట్‌పై 50 మాత్రమే. తెలంగాణలో ఇదివరకే టికెట్ ధరలు పెరిగి ఉన్నాయి కాబట్టి ప్రభుత్వాన్ని ఏమీ అడగలేదు. ఈ సినిమాకు రెండు రాష్ర్టాల్లో ఎలాంటి బెనిఫిట్ షోలు కూడా లేవు' అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. ఆయన సమర్పణలో నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందిన 'తండేల్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. బన్నీ వాసు నిర్మాత. ఈ సందర్భంగా గురువారం ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'సినిమాల విషయంలో లాభనష్టాలను మేమే భరించడం గీతా ఆర్ట్స్ పాలసీ. ఈ చిత్రానికి మేము అనుకున్నదానికంటే ఎక్కువ ఖర్చయింది. అయినా సినిమా మీద పూర్తినమ్మకంతో సొంతంగా రిలీజ్ చేస్తున్నాం' అన్నారు. ఈ సినిమాలో చివరి అర్ధగంటలో భావోద్వేగాలు పతాక స్థాయిలో ఉంటాయని, అంచనాలకు మించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని, ఈ పాలి యేట గురితప్పేలేదు..రేపొద్దున్న రాజులమ్మ జాతరే అని నాగచైతన్య పేర్కొన్నారు. దర్శకుడు చందు మొండేటి మాట్లాడుతూ 'ఈ ప్రేమకథలోని భావోద్వేగాలు హృదయాన్ని కదిలిస్తాయి.ఒక మనిషి కోసం తొమ్మిది నెలల ఎదురుచూపులో ఎంతటి వేదన ఉంటుందో సాయిపల్లవి పాత్రను చూస్తే అర్థమవుతుంది. చైతూ, సాయిపల్లవి పోటాపోటీ నటనను ప్రదర్శించారు' అన్నారు. ఈ సినిమాలో పాకిస్తాన్ సీక్వెన్స్ కోసం దర్శకుడు ఎంతో పరిశోధన చేశారని, విజయంపై పూర్తి విశ్వాసంతో ఉన్నామని నిర్మాత బన్నీ వాసు తెలిపారు.





